క్లుప్తంగా

అల్బనిజం జన్యు సంబంధ సమస్య

కాకినాడ రూరల్: అల్బనిజం పుట్టకతో వచ్చే అనారోగ్య సమస్య అని దీనిని జన్యుపరంగా వచ్చే అరుదైన సమస్య అని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ అల్బనిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అల్బనిజం, తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. వ్యాధిగ్రస్తులకు జుట్టు, చర్మం, కళ్లలో ఉండే మెలనిన్ అనే వర్ణ ద్రవం లోపించి మొత్తం శరీరం తెల్లగా లేదా లేత గులాబీ రంగులోకి మారుతుందన్నారు. ఈ వ్యాధిగ్రస్తులు ఎక్కువ సేపు సూర్యరశ్మిలో ఉండలేరన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, ఓం నమశ్శివాయ, శిరీష, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి ఆర్థిక సాయం



బాలుడి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ సతీష్, బృందం

కాకినాడ క్రైం: రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలైన నాలుగేళ్ల బాలుడి వైద్యానికి శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ దాతల సహకారంతో రూ.60 వేల సాయం అందజేసింది. కాకినాడ రూరల్ మండలం చిన్న స్వామి నగర్‌కు చెందిన శివ, ఝాన్సీ దంపతుల కుమారుడు జ్ఞానేశ్వర్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై కుడి కాలి పాదానికి శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ఇందుకోసం రూ.5 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పగా ఆ తల్లిదండ్రులు శ్రీ యువసేన వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్‌ను సంప్రదించారు. ఆయన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ మావా బ్రో ఫుడ్ వోల్స్ శివ, వెంకీ, రణస్థలం రమణలతో కలసి శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి సాయాన్ని అందజేశారు.

సుప్రీంకోర్టు ఆదేశం సర్కారుకు చెంపపెట్టు

వైఎస్సార్ సీపీ మహిళా నేత జమ్మలమడక



కాకినాడ రూరల్: సాక్షి టీవీ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును వెంటనే విడుదల చేయాలని ప్రజాస్వామ్యాన్ని, వాక్ స్వాతంత్ర్యాన్ని పరిరక్షించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశం చంద్రబాబు సర్కార్‌కు చెంపపెట్టు అని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. సుప్రీంతీర్పు నేపథ్యంలో శుక్రవారం ఆమె మీడియాకు ఇచ్చిన ప్రకటనలో విశ్లేషకుడి వ్యాఖ్యలతో కొమ్మినేనికి సంబంధం లేదని, డిబేట్లను గౌరవ ప్రదంగా చూడాలని నవ్వినంత మాత్రానా అరెస్ట్ చేస్తారా అని చురక వేయడంతో అరాచకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి బుద్ధి చెప్పినట్టయిందన్నారు. అమరావతి నిర్మాణాల పేరిట కోట్లు రూపాయల అవినీతి, క్షీణించిన లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై తీవ్రంగా చర్చ జరుగుతున్నందున ప్రజల దృష్టిని మళ్లించడానికి చంద్రబాబు కృత్రిమ వివాదాలు సృష్టిస్తున్నారని ఆమె ఆరోపించారు. సాక్షి యూనిట్ కార్యాలయాలపై ఉద్దేశపూర్వకంగానే దాడులు చేశారన్నారు. కార్యక్రమంలో కోర్టు తీర్పును గౌరవించి కొమ్మినేనిని తక్షణం విడుదల చేయాలన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాకినాడ రూరల్: మండల పరిధిలోని పోలవరం బీచ్ రోడ్డులో జగన్మోహనపురం ఆర్చ్ ఎదురుగా సముద్రం ఒడ్డున గుర్తు పట్టడానికి వీలు లేని విధంగా పాడైన వ్యక్తి మృత దేహం లభ్యమయ్యింది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడి వయసు సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండవచ్చు. మృతదేహం బోర్లా పడి ఉండడంతో పాటు చర్మం పూర్తిగా కుళ్లిన స్థితిలో పుర్రె, ఎముకలు బయటకు కనిపిస్తున్నాయి. మృతుడి ఒంటిపై ఎరుపు రంగు కట్ బనియన్, నలుపు రంగు డ్రాయర్ ఉన్నట్టు గుర్తించారు. వీఆర్వో పితాని సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గణేష్ కుమార్ తెలిపారు. ఆచూకీ తెలిస్తే తిమ్మాపురం పోలీసు స్టేషన్ నంబరు 0884- 2306332తో పాటు సెల్ నంబరు 94407 96556కు సంప్రదించాలని కోరారు.

చురుగ్గా గడ్డర్ల ఏర్పాటు

సామర్లకోట: అచ్చంపేట నుంచి సామర్లకోట ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ వరకు జరుగుతున్న భారత్ మాల జాతీయ రహదారి బ్రిడ్జి పనులలో భాగంగా సామర్లకోట-కాకినాడ రోడ్డులో శుక్రవారం గడ్డర్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అచ్చంపేట జంక్షన్ నుంచి అధునాతన సాంకేతిక పద్ధతుల్లో ఫ్లైవర్‌కు సంబంధించి స్తంభాల నిర్మాణం పూర్తి చేశారు. వాటిని కలుపుతూ రెడీమేడ్ గడ్డర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సాంకేతిక నైపుణ్యంతో తయారైన గడ్డర్లు ఆయా ప్రదేశాలకు చేరుకున్నాయి. దాంతో ఈ నెల 7వ తేదీ నుంచి సామర్లకోట-కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం వద్ద నుంచి ట్రాఫిక్ మళ్లించారు.



తుల్యభాగ డ్రెయిన్‌లో మునిగి రెయిలింగ్ మాత్రమే కనిపిస్తున్న బల్లకట్టు



2013లో నాటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు చేయించిన బల్లకట్టు (ఫైల్)

కొంగోడు వినరూ..

- పొలాలు తుల్యభాగకు ఆవల
- దాటాలంటే బల్లకట్టే దిక్కు
- నేడు అదీ నీట మునిగింది
- వెళ్లే దారిలేక అన్నదాత అవస్థ
- వంతెన కోసం 8 ఏళ్లుగా ఎదురుచూపు
- హామీలిచ్చేవారే కానీ తీర్చేవారు లేరు

కరప: అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా పరిణమించింది. పంట పొలాలకు వెళ్లి రావాలంటే బల్లకట్టు లేక రైతులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొంగోడు రైతులకు చెందిన పొలాలు ఆ గ్రామానికి చేరువన, తుల్యభాగ డ్రెయిన్ ఆవల వేములవాడ సరిహద్దులలో ఉంటాయి. గతంలో తుల్యభాగ ఏటిని దాటేందుకు బల్లకట్టు ఉండేది. కొంగోడు రైతులు తమపొలాలకు వెళ్లేందుకు బల్లకట్టుపై ప్రయాణించి తుల్యభాగ డ్రెయిన్ దాటి వెళ్లేవారు. వర్షాకాలంలో అధిక వర్షాలు, పై మండలాల నుంచి వచ్చే వరద నీటితో **ఈ డ్రెయిన్ పొంగి ప్రవహించేది. ఆ సమయాల్లో రైతులు సాహసం చేసి బల్లకట్టుపై రాకపోకలు సాగించేవారు. కొంగోడు గ్రామస్తులు వేములవాడ మీదుగా కరప, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే డ్రెయిన్ దాటడమే దగ్గర దారి. అలాగే వేము**లవాడ పరిసర గ్రామాలవారు కూడా గొల్లపాలెం, కోటిపల్లి, ద్రాక్షారామ వెళ్లాలంటే అడ్డదారిగా ఉంటుందని బల్లకట్టుపై వెళ్లి కొంగోడు మీదుగా రాకపోకలు సాగించేవారు. కరప, కాజులూరు మండలాలను అనుసంధానం చేసేందుకు తుల్యభాగ డ్రెయిన్‌పై కొంగోడు వద్ద బల్లకట్టు ప్రయాణ బాధలు తప్పించి, వంతెన నిర్మించాలని ప్రజలు కోరేవారు. కొంగోడులోని బల్లకట్టు ధ్వంసమైతే 2013లో అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కొత్తది తయారు చేయించారు. వంతెన నిర్మాణానికి టీడీపీ, కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చినా నెరవేరలేదు. ఎన్నికల వస్తుండటంతో 2017లో టీడీపీ నాయకులు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా, పనులు 8 ఏళ్లయినా జరగడం **లేదు. బల్లకట్టు తిరిగే ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపట్టడంతో బల్లకట్టును కొంచె దూరంలో తిప్పేవారు. ఆ బల్లకట్టు కూడా తుల్యభాగ డ్రెయిన్‌లో మునిగిపోయి రెండేళ్లుగా నీటిలోనే ఉండిపోయింది. దాని గురించి ఎవరూ పట్టించుకోక**పోవడంతో రాకపోకలకు రైతులు యాతన పడుతున్నారు. అటు వంతెన నిర్మాణం జరగక, ఇటు బల్లకట్టు లేక రెంటికీ చెడ్డ రేవడి అన్న చందాన తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ సరిహద్దులోని పొలాలకు వెళ్లాలంటే బల్లకట్టు లేక రాను పోను 8 కిలోమీటర్లు చుట్టు తిరిగి రావాల్సి వస్తోందని ఆ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బల్లకట్టు గురించి 2023లో అప్పటి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి తీసుకు వెళ్లగా కొత్తది చేయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు కొంగోడు గ్రామస్తులు తెలిపారు. ఆ తర్వాత ఎన్నికలు, ప్రభుత్వం మారడంతో కూటమి నేతలు ఈ సమస్యను పట్టించుకోవడం లేదని కొంగోడు ప్రజలు ఆరోపిస్తున్నారు. రైతుల, ప్రజల ఇబ్బందులను గమనించి కొత్త బల్లకట్టు తయారు చేయించాలని వారు కోరుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



తుల్యభాగ అవతల ఉన్న తమ పొలాలకు వెళ్లాలంటే చాలా కష్టంగా ఉంది. బల్లకట్టు నీటమునిగి చాలా కాలమైనా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి కొత్త బల్లకట్టును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఇలారసు శివ, కొంగోడు.

చుట్టుతిరిగి రావాల్సి వస్తోంది



ఏటికి అవతల ఉండే తమ పొలాలకు వెళ్లాలంటే ఏటిలో ఈతకొట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. ఈత రాని వారు కొంగోడు గ్రామంలోంచి గొర్రిపూడి మీదుగా 8 కిలో మీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. రైతుల, ప్రజల ఇబ్బందులను గమనించి బల్లకట్టును బాగుచేయించాలి.

– ఉడా చిన యాకాబు, కౌలురైతు, కొంగోడు

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

కాకినాడ రూరల్: వ్యవసాయం కోసం చేసిన అప్పులు పేరుకుపోయి, తాకట్టు పెట్టిన ఇంటిని బ్యాంక్ అధికారులు స్వాధీనం చేసుకోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందిన కొటికల రాజేష్ (29) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ రూరల్ పండూరులో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం రాజేష్, అతని అన్నయ్య కలసి రెండేళ్ల కిందట కౌలుకు వ్యవసాయం చేశారు. తండ్రి లేకపోవడంతో కుటుంబ భారం మోస్తూ వ్యవసాయం చేసేందుకు ఇంటిని బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రుణం తీసుకున్నారు. వ్యవసాయంలో నష్టపోయి బ్యాంక్ రుణం చెల్లించలేకపోయారు. పలు దఫాలుగా నోటీసులు ఇచ్చిన బ్యాంక్ అధికారులు చివరకు వారి ఇంటిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో మనస్తాపం చెందిన రాజేష్ మానసికంగా కుంగిపోయాడు. ఈ నెల 11వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో గడ్డి మందు తాగి, ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి అతడు మృతి చెందాడు. మృతుడి తల్లి అప్పలకొండ ఫిర్యాదు మేరకు తిమ్మాపురం ఎస్సై గణేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

బోట్‌క్లబ్: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖలో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులకు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. స్థానిక రామారావు పేటలోని జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న ఉద్యోగుల సేవలను ఉన్నతాధికారులు, సిబ్బంది కొనియాడారు. డివిజనల్ పీఆర్వోగా పని చేస్తున్న పి.రవి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు, ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న జి.ధర్మరాజు ఏలూరు జిల్లాకు, రికార్డు అసిస్టెంట్ సీహెచ్ పద్మ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సమాచారశాఖ డీడీ నాగార్జున మాట్లాడుతూ ఉద్యోగుల జీవితంలో బదిలీలు సాధారణమని బదిలీపై వెళ్తున్న నూతన ప్రదేశంలో కూడా అధికారులను, మీడియా ప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ వారు పని చేయాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సభలో సీనియర్ అసిస్టెంట్ బషీర్, పీఆర్ఓ ఎస్.అజయ్ పాల్గొన్నారు.



ఉద్యోగులకు జ్ఞాపికలు అందిస్తున్న సమాచార శాఖ డీడీ నాగార్జున

ఆలయం వద్ద ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలు తొలగించడంతో కనపడుతున్న ఆలయ గోపురం

సాక్షి ఇంపాక్ట్

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర ఆలయం ఈఓ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని శుక్రవారం అధికారులు తొలగించారు. టీడీపీ విజయోత్సవ ర్యాలీ పేరుతో ఆలయం గోపురం కనిపించకుండా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన రెండు ఫ్లెక్సీలపై సాక్షిలో 'ఆకతాయితనానికి అంతేది' శీర్షికన కథనం రావడంతో దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ స్పందించి వెంటనే వాటిని తొలగించాలని ఈఓను ఆదేశించారు. ఈ ఫ్లెక్సీలపై కాకినాడ మున్సిపల్ అధికారులు కూడా స్పందించారు. దీంతో ఈఓ ఫ్లెక్సీలు తొలగించారు. దీంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

తల్లికి వందనం కోసం ఆధార్ అనుసంధానం చేయండి

బోట్‌క్లబ్: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు వారి ఖాతాలకు జమకాని వారు ఎన్పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సోషల్ వేల్ఫేర్ జేడీ ఎం.శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 2367 మందికి తల్లికి వందనం డబ్బులు వారి తల్లి ఖాతాలో జమ కాలేదన్నారు. డబ్బులు పడని విద్యార్థులు వారి సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలో సంప్రదించాలన్నారు. తల్లికి వందనం డబ్బులు తల్లి ఖాతాలో జమ చేసేందుకు శనివారం ఉదయం 11 గంటలకు పోస్టల్ అధికారులు సహకారంతో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 9, 10 తరగతులు చదువుతున్న 500 మంది విద్యార్థులకు తల్లికి వందనం డబ్బులు జమ కాలేదన్నారు. వారి తల్లులు కూడా ఈ మేళాలో పోస్టల్ ఖాతా ఓపెన్ చేయాలన్నారు.

17న పాలస్తీనా సంఘీభావ దినం

బోట్‌క్లబ్: ఈ నెల 17న పాలస్తీనా సంఘీభావ దినం పాటించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి ఓ.బోడకొండ అధ్యక్షతన జరిగిన వామపక్ష పార్టీల సమావేశంలో పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ఊచకోతను నాయకులు ఖండించారు. 20 నెలలకు పైగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారన్నారు. తక్షణం ఇజ్రాయిల్‌కు భారత ప్రభుత్వం మద్దతు నిలిపివేయాలని, పాలస్తీనీయులపై ఇజ్రాయిల్ మారణకాండ, వివక్ష, ఆక్రమణలకు వ్యతిరేకంగా ఈ నెల 17న జిల్లా వ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సంఘీభావ ప్రదర్శనలు, నిరసన ర్యాలీ లు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు కాకినాడ బాలాజీ చెరువు నుంచి కొవ్వొత్తుల ర్యాలీ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దువ్వ శేషబాబ్జీ, కె.ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీతా పారాయణలో గంగా భవాని ప్రతిభ



జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి నుంచి బహుమతులు గెలుచుకున్న మహిళలతో వాకాడ మహిళ గంగాభవాని

ప్రశంసాపత్రం అందజేసిన జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి

కరప: కర్నాటక రాష్ట్రం శృంగేరీలోని జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం నిర్వహించిన శ్రీమద్భగవద్గీత ప్రత్యక్ష పారాయణం పోటీలో మండలం వాకాడ గ్రామానికి చెందిన దూడల గంగా భవాని ప్రతిభచూపి ప్రథమ బహుమతిని, ప్రశంసా పత్రాన్ని సాధించారు. జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి నుంచి ఈ పురస్కారం అందుకున్నట్టు శుక్రవారం ఆమె స్థానిక విలేకరులకు తెలిపారు. గత ఏడాది కూడా తాను ఈ ఘనత సాధించినట్టు ఆమె తెలిపారు. ఆమెను వాకాడ మాజీ ఉప సర్పంచ్ దూడల నారాయుడు, కాకినాడలోని ఎముకలవ్యాధి నిపుణులు డాక్టర్ బొండా సూర్యారావు, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, గరగ జెమ్మీ తదితరులు అభినందించారు.

92వసారి రక్తదానం



రక్తదానం చేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: గ్రామ మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు శుక్రవారం 92వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన కాకినాడలోని బ్లడ్ బ్యాంక్‌కులో రక్తదానం చేశారు. బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శారద, అభినయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మట్టపర్తి శ్రీధర్ సిద్ధు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో రైల్వే జడ్జి



రైల్వే జడ్జి దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న ఆలయ పండితులు

సామర్లకోట: దక్షిణ మధ్య రైల్వే (విజయవాడ) కోర్టు జడ్జి ఆర్.వెంకటేశ్వరశర్మ దంపతులు స్థానిక పంచారామ క్షేత్రంలో కుమారా రామభీమేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరిలను దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి ఆలయానికి వచ్చిన జడ్జి దంపతులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఆలయంలో పూజల అనంతరం ఆలయ పండితులు జడ్జి దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు.

పత్ర, గాత్ర సమ్మేళనం

విజ్ఞాన, వినోదాల సమాహారంగా ఎరెవ్నా రెండో రోజు సదస్సు



సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా డ్యాన్స్ చేస్తున్న వైద్య విద్యార్థులు



మృతదేహం తలపై న్యూరో సర్జరీ ప్రక్రియలు చేస్తున్న విద్యార్థులు

కాకినాడ క్రైం: పత్రం, నృత్యం, గాత్రం ఇలా విజ్ఞాన, వినోదాల సమాహారంగా రెండో రోజు ఎరెవ్నా 4.0 సదస్సు శుక్రవారం ఘనంగా జరిగింది. కాకినాడ జీజీహెచ్, ఆర్ఎంసీ ఆవరణలు ఇందుకు వేదికయ్యాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రోజు సదస్సు విద్యార్థులకు విజ్ఞానదాయక అనుభూతిని కలిగించింది. ఉదయం పత్ర సమర్పణల అనంతరం ట్రెజర్ హంట్ పేరుతో వైద్య విజ్ఞానాన్ని పెంపొందించే పోటీల పరంపరం మొదలైంది. 9 నుంచి 12 గంటల మధ్య హ్యాండ్స్ ఆన్ సర్జరీ, బేసిక్ ట్రామా, ఎక్యూట్ మెడికల్ కేర్ అండ్ హ్యాండిలింగ్ ఎమర్జెన్సీస్, ఫీటల్ అటాప్సీ, విజియోనెక్స్, టినీ బేబీస్ బిగ్ స్కిల్స్ అంశాలపై ప్రయోగాత్మక ప్రక్రియల ద్వారా విషయావగాహన పెంపొందించుకున్నారు. అలాగే, నియోనెటాలజీ, బర్తింగ్ ట్రిబియన్స్, న్యూరో సర్జరీ సంబంధిత ప్రక్రియలు, రేడియేషన్ ఆంకాలజీ, కాగ్నిటివ్ కరెంట్స్, డయాగ్నస్టిక్ స్కిల్స్ అంశాలపై పత్ర సమర్పణ చేశారు. అనంతరం మెడికల్ డిబేట్ నిర్వహించారు. సాయంత్రం రంగరాయ వైద్య కళాశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నృత్యం, గాత్రంతో అదరగొట్టారు. శుక్రవారం రాత్రి వరకు ఈ కార్యక్రమాలు అట్టహాసంగా సాగాయి. మెడికో హరికృష్ణ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు అనుబంధ కార్యక్రమాల్లో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ శశి తదితరులు పాల్గొన్నారు.



నవఖండ్రవాడ వద్ద తూటికాడతో పూడుకు పోయిన పీబీసీ కాలువ



పిఠాపురం మండలం రాపర్తి సమీపంలో అధ్వానంగా ఉన్న పంట కాలువ

క్లోజర్‌లో జలగలు!

రేపో మాపో పంట కాలువలకు నీరు వదులుతారు. ఈ లోగా కాలువల్లో పూడికలు తొలగించి, గండ్లు పూరించి సాగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కాలువల్లో పేరుకుపోయిన తూటికాడ అసలు ఇది కాలువేనా అనే భ్రమ కల్పిస్తోంది. నీటి చుక్క కనపడని విధంగా కాలువలన్నీ ఇలానే పచ్చని పంటలా కనిపిస్తున్నాయి. మరి క్లోజర్ అంటే కాలువ కనపడకుండా క్లోజ్ చేయడమనుకున్నారో ఏమో మరి. క్లోజర్ పనులకు విడుదల చేసిన నిధులను కాలువ నీటితో పాటు జలగల్లా పీల్చేశారో ఏమో మరి!

- ఎక్కడి తూడు అక్కడే
- కాలువ కనపడనంతగా కమ్మేసిన ఫైనం
- అస్తవ్యస్తంగా సాగునీటి వ్యవస్థ
- మరమ్మతులకు నోచుకోని గండ్లు
- ఆందోళనలో ఏలేరు, పీబీసీ రైతులు

పిఠాపురం: పని చేసినట్లు ఉండాలి.. కాని చేయకూడదు.. చేసినట్టుగా రాసుకుని దొరికినంతా దోచేయాలి.. ఇదీ ప్రస్తుతం కాలువల అభివృద్ధిలో సాగుతున్న తంతు. కూటమి నేతలు చేస్తున్న క్లోజర్ పనుల తీరుకు రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. నియోజకవర్గంలో ఏ కాలువ చూసినా పూడికతో నిండి పోయి ఉండగా క్లోజర్ పనులు మాత్రం శరవేగంతో జరుగుతున్నట్లు కూటమి నేతలు ఫొటోలకు ఫోజులిస్తున్నారని రైతులు అంటున్నారు. ఒక పక్క కాలువలకు నీరు విడుదల చేయగా ఇంకా ఎక్కడి గండ్లు అక్కడే ఉండడంతో ఇక ఈ ఏడాదికి కాలువల అభివృద్ధి లేనట్టేనని రైతులు వాపోతున్నారు. వరదలు వస్తే పంటలు కొట్టుకుపోవడం ఖాయమంటున్నారు. సార్వా సీజన్ ప్రారంభమైంది. రైతులు వరి నారు వేసే పనిలో బిజీగా ఉన్నారు. ఈ మధ్యలో చేపట్టాల్సిన పంట కాలువల అభివృద్ధి పనులు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో ఏలేరు, పీబీసీ కాలువ ద్వారా పంటలకు సాగు నీరు అందే ప్రాంతాల్లో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పుణ్య కాలం పూర్తవుతున్నా ఎక్కడా కాలువల్లో పూడికలు తీస్తున్న దాఖలాలు లేక పోవడంతో ఇంకెప్పుడు చేస్తారంటూ అంటు రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది సార్వాలో ఏలేరు వరదలు నియోజకవర్గంలో పంటలను నట్టేట ముంచగా రబీలో అకాల వర్షాలు పంటలను నాశనం చేశాయి. ఒక పక్క కాలువలు, తూములు, స్లూయిస్‌లు అన్నీ మరమ్మతులకు గురై శిథిలావస్థలో ఉండి ఎక్కడా సాగు నీరు సక్రమంగా పారే పరిస్థితి లేక పోవడంతో పంట విరామ సమయంలో అన్నీ పూర్తి చేస్తారని ఆశగా ఎదురు చూశామని, కాని ఎక్కడా పనులు చేయక పోవడంతో ఈ ఏడాది నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పిఠాపురం మండలం రాపర్తి సమీపంలో ఏలేరు కాలువపై గతంలో పడిన గండి



పిఠాపురం సమీపంలో గొర్రిఖండి కాలువ వద్ద గట్టు సరి చేసి బల్లలు వదిలేశారు